క్లుప్తంగా

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి


ఎస్ఆర్ఐటీలో నిర్వహించిన సదస్సులో అధ్యాపకులు

బుక్కరాయసముద్రం: సాంకేతిక టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని ఐసీటీ అకాడమీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్, ట్రైనర్ సయ్యద్ సమరన్ సూచించారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో 16వ తేదీ నుంచి 21వతేదీ వరకూ నిర్వహించే ఐసీటీ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ప్రాక్టిషనర్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లౌడ్ టెక్నాలజీ ఆవశ్యకత, క్లౌడ్ సర్వీసెస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఐక్యూఏసీ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి వీర ప్రకాష్, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ రాజేష్ బాబు, డాక్టర్ నగేష్, ఇతర కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం జీఎల్ శంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959225856 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు.

26న కాలువలకు నీరు

శింగనమల: శింగనమల చెరువు కింద వరి సాగు కోసం కాలువలకు ఈ నెల 26న నీరు విడుదల చేస్తున్నట్లు చెరువు నీటిపారుదల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. సోమవారం శింగనమలలోని రామాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలువలలో పూడికతీత ప్రారంభమైందన్నారు. పూడికతీత పూర్తవగానే 26వ తేదీ కాలువలను నీరు విడుదల చేస్తామన్నారు. రైతులు వరి పంట సాగు చేయడానికి సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: పట్టణంలోని స్వీపర్స్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పిల్లలకు బరువులు వేయించారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గంగ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు గ్రామంలో సోమవారం మామిడి తోట అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు వివరాల మేరకు.. కొర్రపాడు గ్రామానికి చెందిన వెంకటకొండ 14 ఎకరాల్లో మామిడి పంట సాగు చేస్తున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మామిడితోట అగ్నికి ఆహుతై పోయింది. అలాగే డ్రిప్పు, పైపులు పూర్తిగా కాలిపోయాయి. రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. రైతు సంఘం నాయకులు శివారెడ్డి, కుళ్లాయప్ప, శ్రీనివాసులు పొలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని వారు కోరారు.

బెస్త వీధిలో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు


పైప్‌లైన్ పనులు చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గుత్తి: పట్టణంలోని బెస్తవీధి (11వ వార్డు)లో సోమవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, డీఈ హేమచంద్రకుమార్, ఏఈ హరి కిరణ్, పట్టణ వైసీపీ కన్వీనర్ పీరా, టీడీపీ కన్వీనర్ ఎంకే చౌదరి తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. 'సమస్యల నిలయం.. బెస్త కాలనీ' అనే శీర్షికతో పది రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి డ్యామేజీ అయిన పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయడానికి రూ.రెండు లక్షల నిధులు మంజూరు చేశారు. సోమవారం పైప్‌లైన్ పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ 17: బుక్కరాయసముద్రం మండలం పొదరాళ్ల గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు(29) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. తనకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టిన ఆయన... పంటకు నీరు పెట్టేందుకు బోరు మోటార్ ఆన్ చేసేందుకు స్టాటర్ పెట్టెను తీస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

నవంబర్ 20: యల్లనూరు మండలం దంతపల్లి వద్ద విద్యుత్ తీగ తెగి మీద పడడంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన బయ్యన్న స్వామి పూజారి రామాంజనేయులు(42), కుమారుడు రవి (12) విద్యుదాఘాతంతో దుర్మరణం చెందారు.

డిసెంబర్3: పామిడిలో సంతమార్కెట్‌లో ఉన్న టెంకాయల మస్తాన్ కొట్టం వెనుక ఉన్న షెడ్‌ను తాకడంతో విద్యుదాఘాతంతో బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న బోయ మిద్దే ఆంజనేయులు, లక్ష్మీదేవి కుమారుడు వెంకటేష్ (26) మృతి చెందాడు. ఇలా నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా విద్యుత్ అధికారులు స్పందించడం లేదు.

స్తంభం విరిగిందా.. ప్రాణాలు గోవిందా!


దెబ్బతిని కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

- శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని అధికారులు

యల్లనూరు: ప్రజలు, రైతుల ప్రాణాలతో విద్యుత్ అధికారులు చెలగాటమాడుతున్నారు. విద్యుత్ స్తంభం విరిగినా పట్టించుకోవడంలేదు. విద్యుత్ లైన్ల మీద లైన్‌మెన్ల పర్యవేక్షణ కరువైంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎందరి ప్రాణాలు గాలిలో కలుస్తాయో కూడా తెలియని పరిస్థితి. యల్లనూరు మండలం పెద్దమల్లేపలి వ్యవసాయ పొలాల్లో, పీఎం కొండాపురం వెళ్లే దారిలో ఈశ్వరరెడ్డి తోటలో విద్యుత్ స్తంభం పైభాగంలో విగిరిపోయింది. కిందకు పడేందుకు సిద్ధంగా ఉంది. కింద పడి విద్యుదాఘాంతో ఎవరైనా మృతిచెందితే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. స్తంభాలు లేకపోవడంతో పలువురు రైతులు పొలాల్లో కట్టెలపై విద్యుత్ లైన్లను తీసుకెళ్లారు. అయినా ఇప్పటి వరకు లైన్‌మెన్లు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలేదు. అలాగే విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుపోయాయి. అల్లుకున్న తీగలను ఎవరూ తొలగించడం లేదు. నిర్లక్ష్యపు లైన్‌మెన్లపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


పైపులు, కట్టెలపై విద్యుత్ లైను తీసుకెళ్లిన దృశ్యం


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి



మా వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం దెబ్బతిని కడ్డీలు బయటపడి కూలేందుకు సిద్ధంగా ఉంది. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలి. కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి.

–పెద్దిరాజు, రైతు, పెద్దమల్లేపల్లి

ప్రమాదం జరగకముందే స్పందించండి

యల్లనూరు బస్టాప్‌లో విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా మారింది. పాఠశాలలో నుంచి వచ్చే నీరు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరడంతో ఏపుగా పెరిగిన గడ్డి ఉంది. దీంతో ప్రమాదంగా పొంచి ఉంది. ప్రమాదం జరుగక ముందే అధికారులు, లైన్‌మెన్లు మేల్కోవాలి.

– కమలాకర్, పాతపేట, యల్లనూరు

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి అర్బన్: ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని వాగ్దానాలు చేసి.. అధికారంలోకి రాగానే సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని సీపీఎం నాయకులు మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం సీపీఐ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. అనంతరం సీపీఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒకలాగా అధికారంలోకి రాగానే మరొకలాగా ప్రవర్తించడం సరికాదన్నారు. అలాగే స్మార్ట్‌మీటర్లు బిగించి విద్యుత్ రంగాన్ని కార్పొరేట్‌కు కట్టబెట్టే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ట్రూ అప్ చార్జీల పేరుతో దాదాపు రూ.16 వేల కోట్లు ప్రజలపై భారం మోపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు, శ్రీరాములు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిమోఫీలియా వ్యాధి గ్రస్తులు

గుంతకల్లు రూరల్: హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు పడుతున్న ఇబ్బందులు, పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టర్ ఇంజెక్షన్లను ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేయాలని కోరుతూ వ్యాధిగ్రస్తులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 200 మందికి పైగా హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు ఉన్నామన్నారు. నిరంతర రక్త ప్రసరణతో కూడుకున్న ఈ వ్యాధికి శాశ్వత నివారణ లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. హిమోఫీలియా వ్యాధిబారిన పడ్డవారికి చిన్న గాయం తగిలినా రక్తం గడ్డకట్టకుండా నిరంతరంగా రక్తస్రావం అవుతూనే ఉంటుందని, అలాగే అంతర్గతంగా కూడా రక్తస్రావం అవుతుందన్నారు. ఈ రక్తస్రావాన్ని ఆపాలంటే ఫ్యాక్టర్ 7,8,9 అనబడే ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సరైన సమయంలోఈ ఇంజెక్షన్ ఇవ్వకపోతే శాశ్వత అంగవైకల్యం లేదా ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. మూడు దశల్లో ఉండే ఫ్యాక్టర్ ఇంజెక్షన్ ధర ఒక్కొక్కటి రూ. 50 వేలకు పైగా ఉంటుందన్నారు. ఈ మందులను గతంలో ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలోనూ ఉచితంగా అందజేసేవారని, నాలుగు నెలలుగా ఈ మందులు ప్రభుత్వాస్పత్రుల్లో లేకపోవడంతో బెంగుళూరు, హైదరాబాదు వంటి నగరాలకు వెళ్లి వాటిని కొనుగోలు చేసి చికిత్స చేయించుకోవాల్సి వస్తోందన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవితాలను నెట్టుకొచ్చే మాలాంటి వారు అంతడబ్బు ఖర్చుపెట్టుకుని వైద్యం చేయించుకోవడం చాలా కష్టంగా మారిందన్నారు.

భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


పామిడిలోని భోగేశ్వరాలయంలో శివలింగం


ప్రసన్న పార్వతిదేవిని అలంకరించిన దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సూర్యభగవానుడు ధనుర్ రాశిలో ప్రవేశించు సందర్భంగా సోమవారం ఆరుద్ర నక్షత్రం కలసి రావడంతో పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈసందర్భంగా ఆదిదంపతులు మూలవిరాట్ శివపార్వతి విగ్రహాలను ప్రత్యేక సుగంధ పుష్పాలతో శోభాయానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ వేద మంత్రోచ్ఛరణల నడుమ ఉపన్యాస. అభిషేకం వంటి విశేష పూజలు చేశారు. భజనబృందం ఆధ్వర్యంలో భక్తి సంకీర్తనాలాపనలు గావించారు. నివేదన, నవవిధ హారతుల అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు.

పేట బసవేశ్వరాలయంలో..

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న పేట బసవేశ్వరాలయంలో సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం పౌర్ణమి మహా శివుడికి ప్రీతి పాత్రమైన రోజు కావడంతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు చౌదరి విజయ భాస్కర్, చౌదరి శివ కుమార్ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కసాపురం ఆలయ ట్రస్ట్ మాజీ సభ్యులు కొత్తూరు మల్లికార్జున తన కుటుంబ సభ్యులతో కలిసి కుంకుమార్చన, బిల్వార్చన పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.


గుత్తిలో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

వేధింపుల కేసులో భర్త అరెస్ట్

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెకు చెందిన వివాహిత అంజలిని వేధిస్తున్న భర్త ఎర్రిస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ ఏడాది మే 14న అంజలిని కణేకల్లుకు చెందిన ఆమె భర్త ఎర్రిస్వామి వేధిస్తూ దాడి చేశాడన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడి పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీఐ కేసు నమోదు చేశారు. నిందితులను తహసీల్దార్ శ్రీధర మూర్తి ఎదుట హాజరుపరిచారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిఘా ఉంచాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బోరు బావుల కింద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్న రైతులు రోజు నిఘా ఉంచాలని శాఖ ఏఈ విజయ్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి వైర్లు దొంగలిస్తున్నారన్నారు. రైతులు పొలాల వద్ద కాపాలా ఉండి, అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం


అలంకరణలో కనకదుర్గమ్మ

గుంతకల్లు: స్థానిక సత్యనారాయణపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే కనకదుర్గమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం గావించి విశేష పుష్పాలతో అలంకరించారు. అనంతరం వందలాది మంది దుర్గమ్మ మాలధారుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

తాడిపత్రి అర్బన్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఆధార్ వారోత్సవాలు

యల్లనూరు: మండల కేంద్రంలోని సచివాలయంలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ, 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ నిర్వహించే ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు అప్‌డేట్‌తోపాటు కొత్త ఆధార్ కార్డుల నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎద్దులపల్లిలో శాశ్వత ఆధార్‌కేంద్రం

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి సచివాలయంలో పర్మనెంట్ ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కే తేజోత్స్న సోమవారం తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

23న బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు (అశ్వర్థ పప్పూరు)లో వెలసిన అశ్వర్థ నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి భక్తులు కానుకల ద్వారా సమర్పించిన బియ్యం, బేడలు విక్రయానికి ఈ నెల 23న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం తెలపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

పుట్ట గొడుగుల పెంపకం లాభదాయకం


మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

బుక్కరాయసముద్రం: పుట్ట గొడుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షతన విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పనకు పుట్ట గొడుగుల పెంపకం ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ యువత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతకు పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

మరువ పారుతున్న బీకేఎస్ చెరువు


తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మరువ పారుతున్న చెరువు

బుక్కరాయసముద్రం: అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న బీకేఎస్ చెరువు మరువ పారుతోంది. హంద్రీ నీవా కాలువ మిగులు జలాలు, పీఏబీఆర్ వాటర్ అంతా రాప్తాడు వంక మీదుగా టీవీ టవర్ సమీపంలోని పండమేరు వాగు ద్వారా బీకేఎస్ చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు మరువ పారుతోంది. ఈ మరువ నీరు బీకేఎస్ నుంచి భద్రంపల్లి, గోవిందపల్లి, జంతలూరు, నీలాంపల్లి, గ్రామాల మీదుగా చెదుల్ల గ్రామం సమీపంలో శింగనమల చెరువులోకి చేరుతోంది. చెరువులో చేపలు బయటకు వెల్లకుండా చేపల సంఘం వారు ఇనుప జాలరీ ఏర్పాటు చేశారు.

వేలిముద్రల సేకరణ

గుత్తి: పట్టణంలోని కమేళా వీధిలో చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. వివరాలు.. రాజేష్‌కుమార్, మేరి దంపతుల ఇంట్లో ఆదివారం చోరీ జరిగిన విషయం తెలిసిందే. దొంగలు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం అనంతపురం క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంటిలోని తలుపులు, బీరువా, కిటికీలపై వేలిముద్రలు సేకరించారు.

ఇద్దరి అరెస్టు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద సోమవారం మద్యం సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తుండడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన


గుత్తిలో శిక్షణ ఇస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

గుత్తి రూరల్/పెద్దవడుగూరు/యల్లనూరు/శింగనమల/గార్లదిన్నె: గుత్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆదాయం, లక్ష్యాల సాధనపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అజయ్, మానస పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందికి రెండోవిడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ నరసింహారెడ్డి సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా యల్లనూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్ ఆధ్వర్యంలో సుస్థిర మండల అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజామణి, సీహెచ్‌ఓ మధుకుమార్, ఏఎన్ఎంఎలు, డిజిటల్, ఇంజనీరింగ్ , అగ్రికల్చర్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.
అలాగే శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు , పశుసంవర్ధక సిబ్బందికి ఆర్‌జీఎస్ఏ 2024–25 కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ గంగాధర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్య దర్శులు,వీఆర్‌ఓలు ,గ్రామ సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.